సాక్షి
ఆదిలాబాద్
7
బుధవారం । 1 । జనవరి । 2025


కేక్ కట్ చేసి కేరింతలు కొడుతున్న యువత, చిన్నారులు

లక్ష్యం వైపు సాగుతా.. విజయం సాధిస్తా


2024 సంవత్సరాన్ని ఒక పాఠంగా భావిస్తా. కొత్త ప్రయత్నాన్ని ఏర్పర్చుకుని పట్టుదల వీడకుండా లక్ష్యం వైపునకు సాగుతా. ఓటమిని తొలిమెట్టుగా మలుచుకొని విజయభేరి మోగిస్తా. మంచితనం, ఓర్పుతో అందరితో కలిసిమెలిసి ఉంటా. మంచిని పంచుతూ నాకు తోచిన సాయం చేస్తా. మంచి పుస్తకాలు చదువుతూ జ్ఞానాన్ని పెంపొందించుకుంటా. – పి.జశ్వంత్

విద్యతోనే సమాజంలో గుర్తింపు


విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది. పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా కృషి చేస్తా. గతేడాది జరిగిన తప్పిదాలను పునరావృతం కాకుండా చూసుకుంటాను. ఉపాధ్యాయ కొలువులో చేరాక పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతా. – బి.కార్తీక్

పోటీ పరీక్షలపై దృష్టి


పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని సాధిస్తా. అలాగే ఆరోగ్యాన్ని కూడా విస్మరించను. ప్రతిరోజు వ్యాయామం చేస్తా. అంతే కాకుండా నాకు తోచిన సాయం చేసేందుకు ముందుంటాను. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతా. – సంజన

కొత్త ఆశలతో 2025



- విద్య, ఉపాధి రంగాలపై దృష్టి
- న్యూ ఇయర్‌లో లక్ష్యసాధనపైనే ఫోకస్
- 'సాక్షి' డిబెట్‌లో డైట్ ఛాత్రోపాధ్యాయుల మనోగతం

మాట్లాడుతున్న డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్



డిబెట్‌లో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు



కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది. అయితే గతేడాది పూర్తి కాని ఆశయాలు నూతన సంవత్సరంలో నెరవేరాలని డైట్ ఛాత్రోపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు. 2025లో ఉపాధ్యాయ కొలువుల్లో చేరాలని ఉవ్విళ్లూరుతున్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నట్లు పేర్కొంటున్నారు. టీచర్ కొలువుకు ఎంపిక కావాలని కోరుకుంటున్నారు. 2024కు బై..బై చెబుతూ నూతన ఆశలు, ఆలోచనలతో తలపెట్టిన ప్రతీ కార్యం సక్సెస్ కావాలని 2025కు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం 'సాక్షి' డిబెట్ నిర్వహించింది. పలువురు ఛాత్రోపాధ్యాయులు తమ మనోభావాలు వ్యక్తం చేశారు. – ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్యంపై ఫోకస్


ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలుగుతాం. ప్రతిరోజు వ్యాయమానికి ప్రత్యేక సమయం కేటాయిస్తా. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు. అందుకే కొత్త విషయాలపైనా దృష్టి సారిస్తా. ఉపాధ్యాయ వృత్తి అంటే మక్కువతోనే ఈ కోర్సును ఎంపిక చేసుకున్నాను. – శృతి

లక్ష్యం వైపు సాగుతా..


నా లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదువుతా. అలాగే నూతన నైపుణ్యాలను పెంపొందించుకుంటా. భాషపై పట్టు సాధిస్తా. ఆరోగ్య విషయాలపై దృష్టి పెడతా. ఇందులో భాగంగా ప్రతిరోజు యోగా చేస్తా. గతేడాది పూర్తి కాని లక్ష్యాలను ఈ ఏడాది పూర్తి చేసేందుకు కృషి చేస్తా. – శెల్లవార్ లలన

కొత్త విషయాలు నేర్చుకుంటా..


విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగుతా. లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తా. ప్రధానంగా వృత్తి నైపుణ్యాలపై దృష్టి సారిస్తా. పుస్తకాలు చదవడంతో జ్ఞానం పెరుగుతుంది. కొత్త విషయాలను నేర్చుకునేలా ప్రణాళికతో ముందుకు సాగుతా. – ప్రజ్ఞవి

సమయం వృథా చేయను..


ఓ లక్ష్యాన్ని ఏర్పర్చుకొని సమయం వృథా చేయకుండా ముందుకు సాగుతా. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్య సాధన సులువే. ప్రయత్నాలతో ఏదైనా సాధించగలుగుతాం. ఇటీవల మహిళలు, యువతులపై దాడులు జరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. దోషులకు కఠినంగా శిక్షలు విధించాలి. – రిషిక

కుటుంబ సభ్యులకు ప్రాధాన్యం..


చదువు ఎంత ముఖ్యమో కుటుంబ సభ్యులు కూడా అంతే. వారితో గడిపేందుకు కూడా ప్రాధాన్యత ఇస్తాను. ఆరోగ్యానికి గాను యోగా చేస్తా. తెలియని విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తా. ఉపాధ్యాయ కొలువు సాధించడమే నా ముందున్న లక్ష్యం. – రాథోడ్ నేహ

కొలువు సాధిస్తా..


అమ్మ నాన్న ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతా. వారు కన్న కలలను నిజం చేసేందుకు నిరంతరం శ్రమిస్తా. చిన్న నాటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మక్కువ. కొలువు సాధించేలా చదువుతా. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్య సాధన వైపు సాగుతా. – లావణ్య

టీవీ, ఫోన్లకు దూరంగా..


మన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలనుకుంటే కఠోర సాధన చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా ముందుకు సాగుతా. టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండటం మంచిది. పుస్తకాలు చదువుతూ జ్ఞానాన్ని పెంపొందించుకుంటా. మంచి అలవాట్లు అలవర్చుకుంటూ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపేలా చూస్తా. – బి.శృతి

చదువుతోనే రాణించగలుగుతాం..


చదువు అనేది సమాజంలో ఎంతో ముఖ్యమైనది. ఏ రంగంలో రాణించాలన్నా విద్య తప్పనిసరి. వృత్తి నైపుణ్యత పెంపొందించుకుంటా. మంచి నడవడికతో ముందుకు సాగుతా. సమాజానికి నాకు తోచిన సాయం అందిస్తా. పెద్దలను గౌరవిస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధించుకుంటా. – ఆర్.జగదీష్

కొత్త ఆలోచనతో ముందుకు..

నూతన సంవత్సరంలో ఛాత్రోపాధ్యాయులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి. ఆశయాలకు అనుగుణంగా శ్రమించాలి. గతేడాది సాధించలేని వాటిని ఈ ఏడాది పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. కష్టపడి నేర్చుకుంటేనే భవిష్యత్తులో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించగలుగుతారు. కొత్త ఏడాదిలో అందరూ సక్సెస్‌గా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. – కిరణ్‌కుమార్, డైట్ వైస్ ప్రిన్సిపాల్

హ్యాపీ న్యూ ఇయర్..



జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం రాత్రి నుంచే జిల్లావాసులు థర్టీ ఫస్ట్ వేడుకల్లో మునిగిపోయారు. సరిగ్గా అర్ధరాత్రి కాగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొడుతూ కేక్‌లు కట్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – ఆదిలాబాద్


నృత్యం చేస్తున్న యువతులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కైలాస్‌నగర్: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల పైనే ఆధారపడి ఉంటుందని, వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆరోగ్య కళాశాల కార్యక్రమంలో భాగంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఇంటర్ విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా అభ్యాస దీపికలను అర్థమయ్యేలా రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఈవో సి.రవీందర్, ప్రిన్సిపాళ్లు జే.గణేశ్‌కుమార్, కే.విఠల్, బి.భాగవండ్లు, కే.సుదర్శన్, ఎస్.సూర్యప్రకాశ్, బి.శంకర్, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సబ్జెక్టు రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.


అభ్యాసదీపికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగాలి

నూతన సంవత్సరం పురస్కరించుకుని కలెక్టర్ రాజర్షిషా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2025 సంవత్సరం ప్రతీ ఒక్కరికి శుభాలు చేకూర్చాలని, ప్రతీ కుటుంబం ఆనందంతో గడపాలని ఆకాంక్షించారు.

18 మంది పోలీసులకు సేవా పతకాలు

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తమ సేవలందించి విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని 18 మంది పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఇందులో ఇద్దరు ఉత్తమ సేవా, 16 మంది సేవా పతకాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పాటు ప్రతిభకు దక్కిన పురస్కారమని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్తమ సేవా పతకాలకు ఎంపికైంది వీరే..

సయ్యద్ అన్వర్ ఉల్‌హక్(డీఎస్‌బీ ఎస్సై), సలాం దిలీప్(ఏఎస్సై, ఉట్నూర్)

సేవా పతకం పొందిన వారు..

సీహెచ్ నాగేందర్ (ఉట్నూర్ డీఎస్పీ), ఆర్ సురేందర్ రెడ్డి (డీసీఆర్బీ డీఎస్పీ), ఎస్.శేషారావు (రిజర్వ్ ఎస్సై, అటాచ్డ్ నిజామాబాద్), జి.గౌరయ్య(ఏఆర్ ఎస్సై), రాథోడ్ మారుతి(ఏఎస్సై, నేరడిగొండ), జె.గుణవంత్(ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్), పి.గోవిందరావు(ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్), రాథోడ్ భరత్ (హెడ్ కానిస్టేబుల్ డీటీసీ), బి.సంతోష్ (హెడ్ కానిస్టేబుల్ డీసీఆర్బీ), జె.భారతి(ఉమెన్ హెడ్ కానిస్టేబుల్, మహిళాపోలీస్ స్టేషన్), బి.గంగారెడ్డి(గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్), ఎం.దేవిదాస్(రూరల్ పోలీస్ స్టేషన్), ఎస్.సీతారామరాజు(ఏఆర్ కానిస్టేబుల్), ఎం.భూమన్న(ఏఆర్ కానిస్టేబుల్), ఎస్.స్వామి(కానిస్టేబుల్, జైనథ్ పోలీస్‌స్టేషన్), సీహెచ్.దేవిదాస్ (డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, ఆదిలాబాద్) ఉన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల రాస్తారోకో

ఆదిలాబాద్‌టౌన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 22వ రోజులుగా సమ్మె చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమన్నారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కవిత, అర్చన, హిమబిందు, శ్రీకాంత్, పార్థసారథి, వెంకటి, ధరమ్‌సింగ్, రవిందర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న సమగ్ర ఉద్యోగులు

రెవెన్యూకు 18మంది జూనియర్ అసిస్టెంట్లు


పోస్టింగ్ పొందిన జూనియర్ అసిస్టెంట్లతో కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రూప్–4 రాత పరీక్షలో ప్రతిభచాటి జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికై జిల్లాకు కేటాయించిన 18మంది అభ్యర్థులకు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ మండలాల్లో వారికి పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఉద్యోగులు శ్రీధర్ , సౌజన్య పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు సబ్సిడీపై జొన్న విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి ప్రకటనలో తెలిపారు. రైతులు ఆయా మండలాల్లోని ఏఈవోలను సంప్రదించి విత్తనాలు తీసుకోవాలని పేర్కొన్నారు. జొన్న పులే సుచిత్ర రకం క్వింటాలు ధర రూ.6,500 ఉండగా, సబ్సిడీపై రూ.3వేలు, నాన్ సబ్సిడీ రూ.3,500 ఉందని, అలాగే సీఎస్‌వి–15 రకం విత్తనాల ధర రూ.6,500 ఉండగా, సబ్సిడీపై రూ.1500, నాన్ సబ్సిడీపై రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాల కోసం మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు

- రీజినల్ మేనేజర్ సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని రీజినల్ మేనేజర్ సోలోమన్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ వార్షిక నివేదికను మంగళవారం ఆయన విడుదల చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా రీజియన్ వ్యాప్తంగా 6.47 కోట్ల మంది ప్రయాణికులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. అలాగే 2024లో 30 నూతన బస్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

హత్యలు, నేరాలు తగ్గుముఖం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట
- సైబర్ క్రైమ్ బాధితులకు సత్వర న్యాయం
- వార్షిక నేర వివరాలు వెల్లడించిన ఎస్పీ గౌస్ ఆలం


నేర నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం, ఇతర పోలీస్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: 2024 సంవత్సరంలో హత్యలు, నేరాలు తగ్గుముఖం పట్టాయని, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయడంలో పోలీసు యంత్రాంగం సఫలీకృతమైందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వార్షిక నేర నివేదికను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 2024లో కేసులు, నేరాలు, హత్యలు తగ్గుముఖం పట్టినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయిని అదుపు చేయడంలో ప్రగతి సాధించినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల ద్వారా మోసానికి గురై డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందించడంలో సైబర్ విభాగం కీలక పాత్ర పోషించిందన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పటికీ మరణించిన వారి సంఖ్య గతంతో పోల్చితే తగ్గిందని వివరించారు.

ప్రజలకు చేరువలో పోలీసు..

జిల్లా ప్రజలకు చేరువగా పోలీసు యంత్రాంగం అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గుడిహత్నూర్ మండలంలోని సూర్యగుడ, గాదిగూడ మండలం ఝరి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రక్తహీనత బాధపడుతున్న వారి కోసం పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 275 యూనిట్ల రక్తాన్ని అందించినట్లు తెలిపారు. పట్టణంలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి 325 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. యువత క్రీడల్లో ఆసక్తి కనబర్చేలా వివిధ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

శాంతిభద్రత పరిరక్షణలో..

జిల్లాను ప్రశాంత వాతావరణంలో ఉంచేందుకు యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆదివాసీలతో మమేకమై ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, స్పోర్ట్స్ మీట్, బ్లాంకెట్ల పంపిణీ వంటి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే విపత్తు సమయంలో సత్వర సాయం కోసం జిల్లా పోలీసు యంత్రాంగంతో డీడీఆర్‌ఎఫ్ బృందాన్ని స్థాపించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


టాస్క్‌ఫోర్స్ ద్వారా..


టాస్క్‌ఫోర్స్ ద్వారా జిల్లాలో దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆరు నకిలీ విత్తనాల కేసులు నమోదు చేసి 12 మంది అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.10లక్షల 39వేల 285 విలువ గల విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 77 గంజాయి కేసుల్లో 152 వ్యక్తులపై కేసు నమోదు చేసి 1,044 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.2 కోట్ల 24లక్షల 64వేల 550 ఉంటుందని తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న, నిల్వ చేసిన వారిపై 25 కేసులు నమోదు చేసి 45 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి 1,591 క్వింటళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.26లక్షల 65వేల 395 ఉందని తెలిపారు. అలాగే 98 పేకాట కేసులు నమోదు చేసి 572 మందిని అరెస్టు చేశామని వారి నుంచి రూ.11లక్షల 97వేల 790 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు ఆమ్స్ యాక్ట్ (అక్రమ ఆయుధాల) కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 4 (7.65ఎంఎం) పిస్టళ్లను, 8 మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 78 గుట్కా కేసులను నమోదు చేసి 123 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. కోటి 86లక్షల 77వేల 510 విలువైన గుట్కా స్వాధీనం చేసున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ రెండు కేసులు, ఇసుక మాఫియా ఏడు కేసులు, వ్యభిచారం ఐదు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సైబర్‌కు సంబంధించి ఈ ఏడాది 108 ఫిర్యాదులు రాగా, వాటిని ఎఫ్ఐఆర్‌గా బదిలీ చేసి సైబర్‌క్రైమ్ ద్వారా 32లక్షల 28వేల 674 ఫ్రీజ్ చేసి తిరిగి బాధితులకు అందజేశామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 1969 ఫిర్యాదులు రాగా, వాటిలో 546 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేశామన్నారు. డయల్ 100 ద్వారా ఈ సంవత్సరం 17,086 ఫోన్‌కాల్స్ రాగా, ఏడు నిమిషాలలో సంఘటన స్థలాలకు చేరుకుని పరిష్కరించినట్లు వివరించారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు..

సంవత్సరం	నమోదైన కేసులు	రోడ్డు ప్రమాదాలు..			కోర్టులో నేర నిరూపణ		డ్రంకెన్‌డ్రైవ్	అత్యాచారాలు	చీటింగ్	ఆర్థికనేరాలు	హత్యకేసులు	వరకట్న మరణాలు
		ప్రమాదాలు	మరణాలు	గాయాలైనవారు	కేసులు	నిరూపణ						
2023	3,275	287	127	133	2,164	908	6,753	38	130	266	18	1
2024	3,034	346	133	195	1,714	729	5,583	45	190	344	13	4

అమ్మా.. కరుణించు..


ముస్తాబైన అమ్మవారి ప్రాంగణం


పవిత్ర స్నానాలు చేసే కొలను

- వనక్షేత్రంలో జంగుబాయి దేవత
- నేటి నుంచి నెలపాటు జాతర
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి


జంగుబాయి గుహ


పోచమ్మ ఆలయంలోని ప్రతిమలు

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలం ముకదంగూడ గ్రామపంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 28వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. నెలపాటు ఆదివాసీల ఆరాధ్యదైవం.. అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేస్తుండటంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు సౌకర్యం కల్పించారు. మహారాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్, పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లు అమర్చారు. ఆలయ వరకు సీసీ రోడ్డు వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ సంవత్సరం జంగుబాయి ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తాగునీటితో పాటు రోడ్డు, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించింది. ఇటీవల జంగుబాయి ఉత్సవాలపై హట్టిలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా పత్యేక సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎనిమిది గోత్రాలు ఒకే వేదికపై..

వివిధ రాష్ట్రాల్లో ఉన్న జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెత్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పుజారులుగా వ్యవహరిస్తారు. వనక్షేత్రంలో బస చేసిన పోచమ్మతల్లికీ మొక్కు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారు చేస్తారు. సంప్రదాయ వాయిద్యాలతో గుహలోపలికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడున్న మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతల వద్ద మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. రాత్రి భోజనాల అనంతరం సంప్రదాయ నృత్యాలు చేస్తారు.

గుహలోనే దేవత..

జంగుబాయి దేవత గుహలో బస చేసి ఉంది. గుహ కావడంతో అక్కడికి భక్తులు కూర్చునే వెళ్తారు. చీకట్లో వెలుగుతున్న దీపం రూపంలో అమ్మవారు దర్శనమిస్తుంది. కోరికలు తీర్చే తల్లిగా ఆదివాసీలు విశ్వసిస్తారు. పుష్యమాసం నుంచి అమావాస్య వరకు జాతర కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు నియమనిష్టలతో పాదరక్షలు లేకుండానే నడుస్తూ వస్తారు. నెలపాటు కటిక నేలపైనే పడుకుంటారు. దీపారాధనతో ప్రారంభమయ్యే ఈ జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


అమ్మవారి గుహలో వెలుగుతున్న దీపం

ప్రభుత్వ గుర్తింపుతో అభివృద్ధి

ఏడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం జంగుబాయి ఉత్సవాలకు గుర్తింపునిచ్చింది. ఏటా అభివృద్ధి కోసం రూ.10 లక్షలు విడుదల చేస్తోంది. ఈ నిధులతోనే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తారు. పూజాసామగ్రికి వెచ్చిస్తారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేకమంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్లు, రప్పలు, దుమ్ము, ధూళిలోనూ కొందరు కాలినడకన వస్తే.. మరికొందరు ఎడ్ల బండిపై వస్తారు. సుమారు వెయ్యికిపైగా ఎడ్లబండ్లు రావచ్చని నిర్వాహకుల అంచనా. పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.

ఇలా వెళ్లాలి..

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలంలోని అనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరందోళి మీదుగా, లేదా పరంధోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుపై వెళ్లవచ్చు. నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా, ఆదిలాబాద్ నుంచి లొకారి మీదుగా కూడా జంగుబాయికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

సౌకర్యాలు కల్పించాం

జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం. ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ సిబ్బందిని నియమించాం. నెలపాటు వారు ఇక్కడే ఉండి ఆలయ ఆవరణను శుభ్రంగా ఉంచుతారు.

– అమ్జద్‌పాషా, ఎంపీడీవో

28 వరకు జాతర



బుధవారం నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 28వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ–మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీ రోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్ లైట్లు అమర్చారు.

– మరప బాజీరావు, అలయ కమిటీ గౌరవాధ్యక్షుడు

నాగదేవత ఆలయంలో చోరీ


ఆలయంలో చిందరవందరగా ఉన్న దృశ్యం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

భైంసాటౌన్: పట్టణ శివారులోని భోకర్ రోడ్‌లో గల నాగదేవత ఆలయంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో దేవత విగ్రహంతోపాటు హుండీ చిందరవందరగా ఉండడం, టైల్స్ పగిలి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పట్టణ సీఐ గోపినాథ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలతో ఆధారాలు సేకరించారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాల నాయకులు పలువురు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాగా, ఆలయంలో పగిలిన టైల్స్‌కు మరమ్మతుకు ఇసుక, టైల్స్ తీసుకురాగా, పలువురు హిందూ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. దుండగులను అదుపులోకి తీసుకున్న తర్వాతే చేపట్టాలని కోరారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆలయంలో హుండీ పగులగొట్టిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయంలో చోరీ ఘటన విషయం తెలుసుకుని వెంటనే స్పందించారు. హిందూ దేవాలయాల్లో ఇటీవల ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని, పోలీసులు సమగ్ర విచారణ జరపాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎస్పీ జానకీ షర్మిల తో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

అదుపులో ఇద్దరు అనుమానితులు : ఏఎస్పీ అవినాష్‌కుమార్

ఆలయంలో చోరీ ఘటనకు సంబంధించి కేసు నమోదైనట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. హుండీ పగులగొట్టే క్రమంలో ఆలయ ఆవరణలో టైల్స్ పగిలి ఉంటాయన్నారు. ఎలాంటి పుకార్లు నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

ఎడ్లబండిపై ఊరేగించి..వీడ్కోలు పలికి

- హెచ్‌ఎంకు వీడ్కోలు పలికిన అర్లి (టి) విద్యార్థులు


ఎడ్లబండిపై హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి దంపతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం హెచ్‌ఎం దంపతులను ఎడ్లబండిపై ఊరేగించి వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. పిల్లల అభ్యున్నతికి హెచ్‌ఎం కృషిచేశారని, ఆయన సేవలను కొనియాడారు. వీడ్కోలు కార్యక్రమంలో పాఠశాలకు హెచ్‌ఎం..తన వంతుగా రూ.2 లక్షల విలువ గల కంప్యూటర్, వాటర్ కూలర్‌తో పాటు ఆర్వో ప్లాంట్, సౌండ్ సిస్టం విరాళంగా అందించారు. పలువురు విద్యార్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్ సైతం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన భోజారం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కుంటాల మండలం మెదన్‌పూర్ గ్రామానికి చెందిన భోజారం తన బంధువు సిద్దేశ్వర్‌తో కలిసి బైక్‌పై భైంసా వెళ్తున్నారు. అదే సమయంలో భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీని వానల్‌పాడ్ వద్ద బైక్ ఎదురుగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భోజారం, సిద్దేశ్వర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్సులో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని బడ్‌గాం గ్రామానికి చెందిన బోస్లే పులాజీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ కథనం ప్రకారం.. బోస్లే పులాజీ (51) గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉరేసుకున్నాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని గణేష్‌పూర్‌కు చెందిన చిత్రం అర్జున్ (19) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు కథనం ప్రకారం..అర్జున్ గత కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కుటుంబీకులు మందలించడంతో గతనెల 28న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

బోథ్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి బైక్ ఇటీవల చోరీకి గురైంది. మండల కేంద్రానికి చెందిన బైక్ దొంగ విష్ణును మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విష్ణును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

చిరుతపులి దాడిలో ఆవు మృతి


ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

తలమడుగు: చిరుతపులి దాడిలో ఆవు మృతిచెందింది. మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన నలుగురు రైతులకు చెందిన 30 ఆవులను మేత కోసం కూలీలు సోమవారం ఉదయం మేత కోసం నంది గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి తీసుకెళ్లారు. సాయంత్రం వరకు 29 ఆవులు రాగా, ఒకటి రాలేదు. కూలీలు అటవీ ప్రాంతంలో వెతకగా మంగళవారం ఆవుకు గాయాలై మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో పుండలిక్, గుడిహత్నూర్ ఎఫ్ఎస్ఓ ఇమ్రాన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుతపులి దాడి చేసినట్టు గుర్తించారు. మృతి చెందిన ఆవు విలువ దాదాపు రూ.30 వేలు ఉంటుందని, అధికారులు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు ముడుపు కేదరేశ్వర్‌రెడ్డి కోరాడు.